క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు భిక్ష



అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాములకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. అంతకు ముందుగా ఆలయానికి చేరుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ అయ్యప్ప స్వాములకు స్వయంగా భిక్ష వడ్డించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రను జయప్రదం చేయండి

బేతంచెర్ల: మండలంలో ఈనెల 9 నుంచి 18 వరకు గ్రామాల్లో చేపట్టనున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రను జయప్రదం చేయాలని ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మండల అధికారులు, బ్యాంక్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. సంకల్పయాత్రలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

డోన్ రూరల్: చిరుధాన్యాల సాగు లాభదాయకమని, రైతులు ఆ దిశగా దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సూచించారు. మండల పరిధిలోని ఎర్రగుండ్ల గ్రామంలో శుక్రవారం ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంబడి క్షేత్ర దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ కొందరు రైతులు కొర్ర పండిస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారని గుర్తు చేశారు. రసాయనిక, ఎరువులు, పురుగుల మందులు తగ్గించి పంటలు పండించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకొని పురోగతి సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గిడ్డయ్య, వ్యవసాయ మండల అధ్యక్షుడు యంద్రన్న, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమద్దిలేటి నరసింహస్వామి కల్యాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాస ఏకాదశి శుక్రవారం పురస్కరించుకొని భూనీలా సమేత శ్రీ మద్దిలేటి నరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి శర్మ, కళ్యాణ చక్రవర్తి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అయ్యప్ప మాల స్వీకరించిన పలు గ్రామాలకు చెందిన స్వాములు ముందుగా లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాల ధరించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలవల నరసింహుడు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలోని కూడలిలో రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం ప్రజా సంఘం నాయకులు, విగ్రహ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఓబులేసు భూమి చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు రంగమ్మ, రాములమ్మయ, చాందిని, శంకర్, డీలర్ సునీల్, బాలనాగన్న, నాగయ్య, నాజరాజు, దేవరాజు, రఘు, రమేష్ సుబ్బరాయుడు, డీలర్ వెంకట్, రాజు, దిబ్బ రాజు, జయరాజు, మురళి, భరత్, మాబు హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వేపై దృష్టిసారించాలి

బనగానపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ (జీఈఆర్) సర్వే పై పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈఓ స్వరూప, ఎంఈఓ-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో మండలంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెట్,ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంతో సమావేశం జరిగింది. ఎంఈఓ స్వరూప మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలు గ్రామాల్లో చిన్నచిన్నకారణాలతో బడికి వెళ్లాని బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

నయనాలప్ప క్షేత్రం ముస్తాబు!

- భక్తుల కొంగు బంగారంగా నిలిచిన ఓంకారేశ్వరుడు
- రేపటి నుంచి రెండురోజుల పాటు ఉత్సవాలు
- కార్తీక కడసోమవారం తరలిరానున్న భక్తులు



నయనాలప్ప క్షేత్రం

సంజామల: నంద్యాల జిల్లాలో శైవ క్షేత్రాలైన శ్రీశైలం, మహానంది తర్వాత అంతటి ప్రాధాన్యత నయనాలప్ప క్షేత్రానికి ఉంది. కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట కొంగు భంగారంగా నిలిచారు ఓంకారేశ్వరుడు. సహజసిద్ధి ఎర్రమల కొండల్లో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రమైన నయనాలప్ప క్షేత్రంలో ప్రతి ఏటా కార్తీక మాస కడ సోమవారాన్ని పురష్కరించకుని ప్రత్యేక ఉత్సవాలు, తిరునాల అత్యంత వైభవగం జరుగుతాయి. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా క్షేత్రంలో ఆదివారం నుంచి తిరునాల, ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సంజామల మండలం అక్కంపల్లె గ్రామ సమీపంలో ఎర్రమల కొండలో వెలసిన నయనాలప్ప క్షేత్రానికి ప్రత్యేక చరిత్ర ఉంది. సూమారు 400 సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివభక్తుడు చెన్నబసప్ప ఈ ప్రాంతాన్ని సందర్శించి పకృతి సౌందర్యాలకు ముగ్దుడై కుటుంబసమేతగా కొండపై స్థిరడినట్లు చరిత్ర. ఓ రోజు రాత్రి కలలో చెన్నబసప్పకు ఇక్కడ తన ఆలయం నిర్మించాలని.... పక్కనే ఉన్న అక్కపంల్లె గ్రామస్తులు సహకారం తీసుకోవాలని శివుడు సూచించినట్లు పురాణాల కథనం. భార్య శివాంబతో చర్చించిన చెన్నబసప్ప అనంతరం తన ఆశయాన్ని అక్కెంపల్లె గ్రామస్తులకు వివరించి వారి సహకారంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బసప్పా తన ఎద్దుల సాయంతో రాళ్లను కొండపైకి చేర్చి గర్భగుడి నిర్మాణం సాగించాడు. నేల గుహపై నుంచి ఆలయంలోకి వచ్చేలా సోపానాలు అమర్చాడు.శ అయితే శివ మహిమతో రాళ్లు పైకి చేరాయనే ప్రచారం ఉంది. అంతేకాకుండా పగలు నిర్మించిన కట్టడాలు సరిగా లేనివి సాక్షాత్తూ శివుడే సరిదిద్దారనే చరిత్ర ఉంది. ఒక రోజు రాత్రి అలికిడికి లేచిన చెన్నబసప్ప భార్య శివాంబ...పరమేశ్వరుడు శివగణంబులతో ఆలయ నిర్మాణ పనులు సర్దుబాటు చేస్తున్న దృశ్యాలను చూసి నిశ్చేష్టురాలైనట్లు ఓ కథనం ప్రచారం ఉంది. భర్తను లేపగా శివుడు అదృశ్యమయ్యాడు. సాక్షాత్తూ పరమేశ్వరుడే నిర్మించినందున నేటికీ నేల గుహ ఎయిర్‌కండీషన్ గదిలా ఉందని భక్తులు చెబుతుంటారు. బసప్ప శివుని ప్రత్యేక్షం కోసం కొండ కింద కఠోర తపస్సు చేపడుతాడు. కనిపించని శివుడు తపస్సు విరమించుకు ఆలయ నిర్మాణం పూర్తి చేసి ఓంకారేశ్వరునిగా తనను ప్రతిష్టంప చేయాలని సూచిస్తాడు. అదేవిధంగా కాశీజలాలతో భిషేకిస్తే దర్శన భాగ్యం కలిగిస్తామని శివుడు చెప్పినట్లు పురాణం కథనం. శివాజ్ఞ మేరకు బసప్ప కాశీకి బయలుదేరుతాడు. ఆ సమయానికి శివాంబ రెండు నెలల గర్భిణి. పరమ శివభక్తురాలైన శివాంబకు అచ్చం తన పోలికలతో కూడిన కుమార్తె జన్మించడంతో శరణమ్మగా నామకణం చేస్తుంది.

రెండురోజులపాటు ఉత్సవాలు

ప్రతి ఏటా కార్తీక మాసంలో ఓంకారేశ్వర స్వామి క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్తీక మాసంలో కడ సోమవారం రెండు రోజుల పాటు తిరునాల అంగరంగ వైభవంగా జరుగనుంది. 10,11వతేదిలలో అంకుర్పానం, ఓంకారేశ్వరు ని కల్యానోత్సవం, ధ్వజారోహణ, కలస్థాపన, రు ద్రాభిషకం,స్వామివార్ల గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ చంద్రుడు, అర్చకుడు గణేష్ శాస్త్రి తెలిపారు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను నయనాలప్ప క్షేత్రానికి నడపనున్నారు.

బసప్ప జీవ సమాధి

ఒక రోజు శివాంబ భిక్షాటనకు అక్కంపల్లె గ్రామాని వెళ్లెగా ఆ సమయంలో బసప్ప కాశీ నుంచి గ్రామం చేరుకుంటాడు. తండ్రి రాకను గమనించిన శరణమ్మ సంతోషంగా కలశంతో నీటిని తెచ్చి ఎదురుగా నిలిచింది. తాను కాశీకి వెళ్లే సమయానికి భార్య గర్భిణి అని, తనకు కుమార్తె పుట్టిన విషయం తెలయని బసప్ప శరణమ్మను భార్య అనుకుని పొరబడుతాడు. భార్య అనుకుని వ్యవహరిచిన తీరును గమనించిన శరణమ్మ... నీ కుమార్తెను అని చెబుతుంది. దీంతో కుమార్తెను అక్కున చేర్చుకుని కుమిలిపోతాడు. ఓంకారేశ్వరుని సన్నిధి చేరుకుని బాధపడిన బసప్ప నయనములు ఉన్నందునే ఈ తప్పిదం జరిగగిందని నిర్ధారించుకుంటాడు. నయనములు ఉండడానికి వీల్లేదంటూ రెండు కళ్లను తొలగించి శివసన్నిదిన ఉంచాడు. అంధత్వంతో బాధలు భరించిన బసప్ప చివరకు జీవ సమాధి అయ్యాడు బసప్ప. దీంతో ఆ క్షేత్రం నయనాలప్ప క్షేత్రంగా పేరుగాంచింది. కొంత కాలానికి ఎద్దులు కూడా మృతి చెందడంతో బసప్ప పక్కనే సమాధి చేశారు.



కొలువైన ఓంకారేశ్వరుడు

10న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

సంజామల: నయనాలప్ప తిరునాణాల మహోత్సవం సందర్భంగా ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహిస్తుననట్లు నిర్వాకులు దుగ్గిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, అనిపి నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 10న ఆరు, ఆరుపండ్ల లోపు కోడెల విభాగం, 11న న్యూ క్యాటగిరి విభాగం, 12న నాలుగుపండ్ల, నాలుగుపండ్లలోపు విభాగం రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తామన్నారు. విజేతల వృషభాల యజమానులకు బహుమతులు అందజేస్తామన్నారు.

నేల బెలుం తిరునాల చూసొద్దాం రండి

- 11న కార్తీక మాసం కడసోమవారం
- తరలిరానున్న భక్తులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బందార్లపల్లె సమీపాన వెలసిన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసం కడ సోమవారం రోజు జరిగే తిరునాల మహోత్సవానికి ముస్తాబైంది. కొండల నడుమ ఏకాంత వాతావరణంలో వెలసిన ఆలయం భక్తులను మైమరపిస్తుంటుంది. క్రీ.శ 3వ శతాబ్దాంలో ఆలయ నిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ స్వామి పానిమట్టం శ్రీచక్రాన్ని పోలి సాలగ్రామం రూపంలో కొలువయ్యాడు. కాశీ నుంచి తీసుకొచ్చి లింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు ఆధారాలు ఉన్నాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో తొలి బానోదయ కిరణాలు మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, వీరభద్రస్వామిని తాకుతుంటాయి. కార్తీక మాసం ప్రారంభం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహిస్తు ఉంటారు. చివరి సోమవారం పెద్ద ఎత్తున స్వామి కల్యాణంతో పాటు తిరునాల జరుపుకోవడం ఆనవాయితీ.

బిలంలో స్నానం చేసేందుకు పోటీ

ఆలయానికి ఎదురుగా ఉన్న బిలంలోని పాతాళగంగలో స్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటీ పడుతారు. వందల ఏళ్ల క్రితం బిలం సహజ సిద్ధంగా ఏర్పడింది. ఇందులోని నీరు చాలా పవిత్రమైనవని భక్తుల నమ్మకం. ఇక్కడ స్నానం ఆచరిస్తే ఆరోగ్యంతో పాటు సుఖసంతోషాలు, సిరిసంపదలు కలుగుతాయని భావిస్తుంటారు భక్తులు. బిలం లోపలకి వెళ్లేందుకు ఎంత కష్టమైనా కడ సోమవారం రోజు భక్తులు గంటల తరబడి నిరీక్షించి స్నానాలు ఆచరిస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి: మల్లేశ్వరస్వామి తిరుణాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పూర్వం కల్యాణ స్వామి తపస్సు చేసి సజీవ సమాధి చెందారు. అప్పటి నుంచి కార్తీక మాసం చివరి సోమవారం రోజు తిరునాల నిర్విఘ్నంగా జరుగుతూ వస్తుంది. 11వ తేది బందార్లపల్లె నుంచి పార్వతి పరమేశ్వరులు వృషభవాహనంపై నేల బెలుం చేరుకుంటారు. మరుసటి రోజు నేల బెలుం నుంచి బందార్లపల్లెలో ఊరేగింపు జరుగుతుంది. భక్తుల సౌకర్యం కోసం అనంతపురం జిల్లా తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి నేల బెలుం వరకు బస్సు సర్వీసులు నడుపనున్నారు.



పానిమట్టంపై సాలగ్రామం రూపంలో స్వామి

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం

ప్యాపిలి: రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం ఎల్లవేళలా ఉంటుందని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం రాజేశ్ అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం వ్యయప్రయాసలకు గురి కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు సీజన్ ముగియక ముందే రైతులకు పరిహారం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పంటల బీమాకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి

రూ.4లక్షలతో డిగ్రీ కళాశాలకు త్రీఫేస్ కరెంట్ కనెక్షన్

డోన్ : స్థానిక గుండా వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన త్రీ ఫేస్ కరెంట్ కనెక్షన్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. కొన్నేళ్లుగా త్రీఫేస్ కరెంట్ సౌకర్యం లేక కళాశాలలో ప్రయోగశాల నిరుపయోగంగా ఉండేదని ఈ సందర్భంగా చైర్మన్ గుర్తు చేశారు. కళాశాల పూర్వ విద్యార్థి, న్యాయవాది నాగభూషణంరెడ్డి చొరవతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఎంపీ ల్యాండ్స్ కింద రూ.4లక్షలు చేశారన్నారు. ప్రయోగశాలతో పాటు డిజిటల్ క్లాసులు కూడా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతితో పాటు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



త్రీ ఫేస్ విద్యుత్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

ఎమ్మెల్యే కాటసానికి వనభోజన మహోత్సవ ఆహ్వానం



ఎమ్మెల్యే ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బలిజ సేవా సంఘం నాయకులు

బనగానపల్లె : పట్టణంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో నాయకులు కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు కిశోర్, మహేష్, శ్రీను, మనోహర్, పుల్లన్న, సుబ్బారావు నారాయణ శేష ఫణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. ఓటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం పట్టణంలోని వివేకానంద విగ్రహం నుంచి పాతబస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటు నమోదు ఆన్‌లైన్‌లోనూ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బనగానపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో ఓటు హక్కు, చిరునామ మార్పు, డేత్‌లకు సంబంధించి బీఎల్‌ఓలకు వచ్చిన దరఖాస్తులను శుక్రవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావుతో కలిసి ఆయన ఇళ్ల వద్దకు పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్,బీఎల్‌ఓలు ఈశ్వర్‌రెడ్డి, సురేంద్రబాబు తదితరులు ఉన్నారు.

బేతంచెర్ల: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిస్తూ శుక్రవారం స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల నుంచి పాతబస్టాండు వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులో మానవహారం నిర్వహించి ఓటు ప్రాముఖ్యతను డీటీ సత్యదీప్ వివరించారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఓటర్ల జాబితా తయారు చేయాలి

కొలిమిగుండ్ల: సాధారణ ఎన్నికలకు సంబంధించి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. బీఎల్‌ఓలు రిజిష్టర్లను సక్రమంగా రాయాలని పేర్కొన్నారు. డీటీ నాగేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, ప్రసాదరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

హోంగార్డులకు ప్రశంసా పత్రాలు

డోన్ : పోలీసుశాఖలో అత్యుత్తమ సేవలందించినందుకు డోన్ పట్టణానికి చెందిన హోంగార్డు ఇసాక్‌కు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇసాక్‌తో పాటు డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మరో హోంగార్డు నాయుడుకు కూడా ఎస్పీ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

డోన్: అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పట్టణంలోని 9వ వార్డు సచివాలయం పరిధిలోని 14, 15 వార్డులలో కౌన్సిలర్లు కమటం లక్ష్మి, సుకన్యల ఆధ్వర్యంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని సమాజికవర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కురుకుందు హరి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, సచివాలయ కన్వీనర్ శ్యాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్: పేదప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరోమారు పట్టం కట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్‌లు అన్నారు. పట్టణంలోని 10 వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ కురుకుందు హరి, కౌన్సిలర్లు దినేశ్ గౌడ్, నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేంద్ర, దస్తగిరి, ఫాతిమా, షాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చలిచీమల రంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామానికి సంబంధించి జరిగిన సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాయకులు, బ్రహ్మానందరెడ్డి, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లెలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ అభివృద్ధికి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన నగదు వివరాల బోర్డులను సర్పంచ్ మద్దిలేటి, ఉపసర్పంచ్ మేకల వెంకటేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ఏపీకి వైఎస్ జగన్ ఎందుకు కావాంటే అనే విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామకృష్ణవేణి, సచివాలయ మండల కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, రామవరం సర్పంచ్ మూరబోయిన మనోహర్, గ్రామ పెద్దలు వీరారెడ్డి, నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

అన్నివర్గాలకు సముచిత న్యాయం

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యాగంటిపల్లెలో సర్పంచ్ బండివరలక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబందించిన ఫ్లెక్సీ, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారంలక్ష్మీ దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, శివప్రసాదరెడ్డి, యామ పుల్లారెడ్డి, నాగసుబ్బారెడ్డి, మారం ఈశ్వరయ్య, వెంకటరాముడుతో పాటు ఎంఎల్‌ఓలు మధుసుధాకర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెట్టుపల్లెలో సంక్షేమ బోర్డును అధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న దృశ్యం



పోతుదొడ్డి గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాముకాటుతో చిన్నారి మృతి

బనగానపల్లె రూరల్ : మండలంలోని కైప గ్రామంలో చిన్నారి జెస్సికా (4) పాము కాటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన జె మధు, శ్యామల దంపతులకు కుమారుడు మహేంద్ర, కూతురు చిన్నారి జెస్సికా సంతానం. జెస్సికా సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటుండగా రాళ్ల కింద ఉన్న పాము కాటువేయగా బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామంలో పల్లె నిద్రలో భాగంగా ప్రజలతో సీఐ రామాంజులు, ఎస్ఐ ప్రతాప్ శుక్రవారం సమావేశమయ్యారు. సీఐ మాట్లడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల తాకిడి ఎక్కువగా ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ పర్సనల్ డేటాను తెలియని వ్యక్తులకు ఇవ్వకుడదన్నారు.గ్రామాలలో ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రశాంత జీవితం గడపాలని సూచించారు.

11న అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న ఉదయం 9 గంటల నుంచి అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల, కర్నూలు జిల్లాలకు సంబంధించిన వివిధ కంపెనీలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని 11న మేళాకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

డోన్ టౌన్: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బడి బయట ఉన్న పిల్లలను వలంటీర్ల ద్వారా వివరాలు తెలుసుకుని బడిలో చేర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు.

బేతంచెర్ల: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ వెంగన్న, ఆఓ ఈర్డీ వెంకట రంగ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ సోమశేఖర్, వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జీఈఆర్ సర్వేలో భాగంగా పోస్టర్లను విడుదల చేశారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి సహకరించాలని వారు కోరారు.

అవుకు: బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కునుకుంట్ల , మన్నేనాయక్ తాండా, ఇస్రానాయక్ తాండా గ్రామాల్లో బీఈఆర్ సర్వే నిర్వహించారు.

సన్మానం

బేతంచెర్ల: ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా తొలి అధ్యక్షుడు నాగ మహేష్‌ను బేతంచెర్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజేంద్ర, విష్ణు, జనార్ధన్, రమణ, సుధీర్, సతీష్, మనోహర్, ధనుంజయ, లక్ష్మి నారాయణ సన్మానించారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నాగమహేష్ తెలిపారు.